క్లుప్తంగా

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

పీఏసీఎస్ చైర్మన్ లింగాల రాజలింగారెడ్డి



చెక్కు అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ రాజలింగారెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): బ్యాంకు రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ లింగాల రాజలింగారెడ్డి అన్నారు. మండల పరిధిలోని అందె గ్రామానికి చెందిన శంకర్, బాగవ్వలకు మంజూరైన బర్రెలు, మేకల యూనిట్లకు రూ.5 లక్షల చొప్పున విడుదలైన చెక్కులను దుబ్బాక డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ మహేందర్‌రెడ్డితో కలిసి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణాలు పొందిన రైతులు ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలన్నారు. రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి సొసైటీ బ్యాంకులు ఎంతో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో సీఈఓ రాజు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



ఆర్థిక సాయం చేస్తున్న కౌన్సిలర్ మల్లారెడ్డి

దుబ్బాక: దుబ్బాక మున్సిపల్ పరిధి చెల్లాపూర్ 3వ వార్డుకు చెందిన కంకణాల కనకయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వార్డు కౌన్సిలర్ మల్లారెడ్డి మంగళవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం చేశారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు.

కృష్ణస్వామికి ఘన నివాళి



చిన్నకోడూరులో కృష్ణస్వామి చిత్ర పటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): పాత్రికేయుడు, హైదరాబాద్ మాజీ మేయర్ కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ వర్ధంతి మంగళవారం చిన్నకోడూరులో నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి ముదిరాజ్ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి జంగిటి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజాసేవ చేస్తూ ముదిరాజుల హక్కుల సాధనకు పోరాడిన గొప్పవ్యక్తి కృష్ణస్వామి అన్నారు. 1922లో నిజాం పాలనలో ముదిరాజు మహాసభను స్థాపించారన్నారు. 40 ఏళ్ల పాటు మహాసభ అధ్యక్షుడిగా సేవలందించారన్నారు. మేయర్‌గా హైదరాబాద్‌కు మొదట మాస్టర్ ప్లాన్ వేశారని తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నేతలు ప్రభాకర్, నాగార్జున, సుధాకర్, శ్రీనివాస్, కనకయ్య, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణస్వామి సేవలు చిరస్మరణీయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): హైదరాబాద్ మాజీ మేయర్ కొరివి కృష్ణ స్వామి సేవలు చిరస్మరణీయమని కొరివి కృష్ణస్వామి సేవా సమితి జిల్లా ఇన్‌చార్జి శ్రావణ్ అన్నారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని గ్రీన్ కాలనీ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో కృష్ణ స్వామి 56వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసిన కానిస్టేబుళ్లు



రక్తదానం చేస్తున్న కానిస్టేబుల్ చంద్రశేఖర్

సిద్దిపేటకమాన్: సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పలువురికి కానిస్టేబుళ్లు రక్తదానం చేసి వారిని ప్రాణాపాయం నుంచి కాపాడారు. పట్టణానికి చెందిన ఇద్దరు మహిళలు, ఒక పాప అనారోగ్యంతో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారికి చికిత్స సమయంలో అత్యవసరంగా రక్తం అవసరం ఉందనే విషయం తెలుసుకున్న చిన్నకోడూర్ కానిస్టేబుల్ పర్శరాములు, కుకునూర్‌పల్లి కానిస్టేబుల్ చంద్రశేఖర్, గౌరారం కానిస్టేబుల్ శ్రీనివాస్, ఏఆర్ కానిస్టేబుల్ శ్రీరామ్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి రక్తదానం చేశారు.

యూత్ కాంగ్రెస్ నాయకుడి ఔదార్యం

బెజ్జంకి(సిద్దిపేట): మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని పిచ్చుక గాయపడి అపస్మారక స్థితికి చేరింది. అటుగా వెళ్తున్న యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు శానగొండ శ్రావణ్ కుమార్ దానికి ప్రాథమిక చికిత్స చేసి ఇంటికి తీసుకెళ్లాడు. పిచ్చుకను కాపాడినందుకు ప్రజలు అభినందిస్తున్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ

బెజ్జంకి(సిద్దిపేట): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఉంటుందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ అన్నారు. మంగళవారం బెజ్జంకి మండల కేంద్రానికి మొదటి సారిగా వచ్చిన ఆయనకు మండల నాయకులు బెజ్జంకి క్రాసింగ్ వద్ద ఘన స్వాగతం పలికారు. బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే బెజ్జంకి శ్రీలక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి మాట్లాడారు. గత పాలకులు బంగారు తెలంగాణను అప్పులపాలు చేశారన్నారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పనిసరిగా అమలు చేస్తుందన్నారు. ఇప్పటికే రెండు పథకాలు ప్రారంభించినట్లు తెలిపారు. ఉద్యోగ నోటిఫికేషన్లు, గ్యాస్ సిలిండర్ పథకాలు త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఇక్కడ జరిగిన ప్రభుత్వ భూ అక్రమాలను వెలికి తీసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండల పార్టీ అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభించిన ఎమ్మెల్యే

బెజ్జంకి, బెజ్జంకి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన క్రికెట్ టోర్నీని ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ ప్రారంభించారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు.

అందరి సమన్వయంతో గ్రామాల అభివృద్ధి

- నారాయణరావుపేట సాధారణ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ ఒగ్గు బాలకృష్ణ

సిద్దిపేటరూరల్: గ్రామీణ ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి చేసుకున్నట్లు ఎంపీపీ ఒగ్గు బాలకృష్ణ అన్నారు. మంగళవారం నారాయణరావుపేట మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ సమావేశం భవనంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. సభలో వైద్య, విద్య, రెవెన్యూ, విద్యుత్, వ్యవసాయ శాఖలప్రగతిపై చర్చించారు. అధికారుల పనితీరు సరిగా లేదని మండల ప్రజా ప్రతినిధులు ఆరోపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సహకారంతో మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దామన్నారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో పనిచేయాలని కోరారు. అనంతరం ఆయా గ్రామాల సర్పంచ్ లు మాట్లాడారు. ఐదు సంవత్సరాల సర్పంచి పదవీకాలంలో ఎన్ని సమస్యలు వచ్చినా ప్రజలకు సేవలు అందించడంలో కలిసికట్టుగా పనిచేయడం జరిగిందన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ లక్ష్మీ, ఎంపీడీఓ మురళీధర్ శర్మ తహసీల్దార్ లక్ష్మారెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు సంతోష్ కుమార్, సర్పంచ్ ఆంజనేయులు, ఆయా శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.

చేతి రాత బంగారు భవిష్యత్‌కు పునాది



చేతిరాత మెలకువలు నేర్పిస్తున్న ఏజాజ్ అహ్మద్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): చేతిరాత బంగారు భవిష్యత్‌కు పునాది అని ప్రముఖ చేతి రాత నిపుణుడు ఏజాజ్ అహ్మద్ అన్నారు. మంగళవారం సిద్దిపేట బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేతిరాతపై అవగాహన సదస్సు నిర్వహించారు. మనిషి మనస్తత్వం తెలుసుకోవడం కేవలం చేతిరాతతోనే సాధ్యమవుతుందన్నారు. తెలుగు, హిందీ, ఆంగ్లంలో అందంగా రాసే చిట్కాలు తెలిపారు. అందమైన చేతిరాతతో విద్యార్థులకు ఎక్కువ మార్కులు వస్తాయన్నారు. తాను రచించిన పుస్తకాన్ని ట్రేసింగ్ పద్ధతి ద్వారా త్వరగా నేర్చుకోవచ్చని విద్యార్థులకు ప్రయోగాత్మకంగా చూపించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జయకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల తీరుపై ఆగ్రహం

జగదేవ్‌పూర్(గజ్వేల్): పొలాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లకు విద్యుత్ అధికారులు బిల్లుల బకాయి పేరుతో రైతులకు తెలియకుండా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని, దీంతో నారుమడులు ఎండిపోతుండటంతో రైతులు ఇబ్బందిపడుతున్నారని ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం జగదేవ్‌పూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బాలేశంగౌడ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. ముందుగా వ్యవసాయాధికారి వసంతరావు మాట్లాడుతూ మండలంలో 18402 పాసుపుస్తకాలు, 5045 మంది రైతులు ఉండగా ఇప్పటి వరకు 772 మంది రైతులకు మొదటి విడతలో రూ.కోటి రైతుబంధు ప్రభుత్వం జమచేసినట్లు తెలిపారు. అనంతరం విద్యుత్ ఏఈ శివశంకర్ తమ నివేదికను వినిపిస్తుండగా పీర్లపల్లి ఎంపీటీసీ మహేందర్‌రెడ్డి జోక్యం చేసుకొని రైతులకు తెలియకుండా ట్రాన్స్‌ఫార్మర్లకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారని సభ దృష్టికి తెచ్చారు. విద్యుత్ బకాయి ఉండటంతో సరఫరా నిలిపివేయడం జరిగిందని ఏఈ వివరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు మండల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి కోరారు. సమావేశంలో సర్పంచ్‌లు భానుప్రకాష్‌రావు, లక్ష్మీ, ఎంపీటీసీలు మహేష్‌యాదవ్, మహేందర్‌రెడ్డి, మంజుల, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎంపీఓ శ్రీనివాస్‌వర్మ, ఎంఈఓ ఉదయభాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మండలంలోని తీగుల్ సర్పంచ్ భానుప్రకాష్‌రావు ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపినవారిలో గజ్వేల్ అసెంబ్లీ యువజన కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి బునారి రాజు, నాయకులు కిష్టయ్య, రవి, సాయికుమార్ తదితరులు ఉన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గజ్వేల్‌రూరల్: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని భద్రాచల దేవస్థానంలో ఈనెల 23 నుంచి జరగనున్న వైకుంఠ ఏకాదశి మహోత్సవ కరపత్రాలను ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రామకోటి భక్తసమాజం వ్యవస్థాపకుడు రామకోటి రామరాజు, సామాజిక సమరసతా వేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆకుల నరేష్‌బాబు, ప్రతినిధులు పాల్గొన్నారు.

జాన్ విల్సన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



జాన్ విల్సన్‌కు నివాళులర్పిస్తున్న ఎస్‌ఐ మహేష్

హుస్నాబాద్: విధి నిర్వహణలో అసువులు బాసిన దివంగత సీఐ యాదగిరి, ఎస్సై జాన్ విల్సన్ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం జాన్ విల్సన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఎస్‌ఐ మహేష్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నక్సలైట్లు పేల్చిన మందుపాతరలో సీఐ యాదగిరి, ఎస్‌ఐ జాన్‌విల్సన్, మరికొంత మంది మృతి చెందారన్నారు. జాన్ విల్సన్ వచ్చిన తర్వాత ప్రజలు నిర్భయంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి తమ సమస్యలు చెప్పుకునేవారన్నారు. ఆయనను ప్రతీ పోలీస్ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, మాజీ సర్పంచ్ కేడం లింగమూర్తి, జాన్ విల్సన్ ట్రస్ట్ అధ్యక్షుడు గడిపె ఎల్లయ్య, చంద్రయ్య, వెన్న రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శన

గజ్వేల్‌రూరల్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవితం, ఆశయంపై రూపొందించిన 'సంఘం శరణం గచ్ఛామి' నాటక ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. గజ్వేల్ మహతి ఆడిటోరియంలో తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ సౌజన్యంతో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ కళాకారులు మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవితం, ఆశయం, లక్ష్యాలపై నాటకాన్ని ప్రదర్శించారు. నాటక ప్రదర్శన వీక్షకులను అలరించింది. మహనీయుల జీవిత చరిత్ర పాఠ్యపుస్తకాల్లో చదువుకోవడమే తప్ప ఇలా నాటకాల రూపంలో తెలియజేయడం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో సంక్షేమ శాఖ జిల్లా అధికారి కవిత, మాలమహానాడు జాతీయ నాయకులు, హాస్టల్ వార్డెన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

బైక్ చోరీ

దుబ్బాక: ఇంటి ముందు పార్క్ చేసిన బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ ఘటన దుబ్బాక పట్టణంలో సోమవారం జరగగా మంగళవారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దుబ్బాక సీఐ మున్నూరు కృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన ఆస శ్రీనివాస్ రోజు మాదిరిగానే ఈనెల 17వ తేదీ రాత్రి ఇంటి ముందు తన ఫ్యాషన్ ప్లస్ బైక్‌ను పార్క్ చేశాడు. తెల్లవారుజామున లేచిచూడగా వాహనం కనిపించలేదు. ఎంత వెతికినా వాహనం కనపించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

అర్హులకు డబుల్ ఇళ్లను కేటాయించాలి



వినతిపత్రం ఇస్తున్న గజ్వేల్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులు

గజ్వేల్‌రూరల్: సర్వే చేసి అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని జ్యోతిరావుపూలే ప్రజాభవన్‌లో మంగళవారం జరిగిన ప్రజావాణిలో ఈ మేరకు దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు పేదలు దరఖాస్తు చేసుకున్నారని, అయితే ప్రభుత్వం సర్వే పేరిట కాలయాపన చేసిందన్నారు. గజ్వేల్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ఎంపికకు నిర్వహించిన లక్కీ డ్రా జాబితాలో పేర్లు వచ్చినప్పటికీ వారికి కేటాయించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలన్నారు. అలాగే ఇంటి స్థలమున్న వారికి రూ.5 లక్షల ఆర్థిక సాయం, ఇందిరమ్మ గృహలక్ష్మీ పథకాన్ని వెంటనే ప్రారంభించాలని కోరారు.

ఉద్యోగులకు బదిలీలు సహజం

ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): ఉద్యోగులకు బదిలీలు సహజమని ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధి దుద్దెడ హైస్కూల్లో ముగ్గురు ఉపాధ్యాయులు పద్మారెడ్డి, విజయలక్ష్మి, శ్రీనివాస్ బదిలీ అయ్యారు. మంగళవారం హెచ్‌ఎం లక్ష్మి అధ్యక్షతన వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు. విద్యార్థులు ఉన్నతస్థాయికి వెళ్తే ఉపాధ్యాయులకు లభించే తృప్తి వెలకట్టలేమన్నారు. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించారు.

విశ్వకర్మ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

అఖిల భారత విశ్వకర్మ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శివంపల్లి రాజేశం



మాట్లాడుతున్న అఖిల భారత విశ్వకర్మ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శివంపల్లి రాజేశం

హుస్నాబాద్: కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేసి విశ్వకర్మలకు రుణాలు మంజూరు చేయాలని అఖిల భారత విశ్వకర్మ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శివంపల్లి రాజేశం విజ్ఞప్తి చేశారు. హుస్నాబాద్‌లో మంగళవారం సంఘం నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న విశ్వకర్మలకు ఉచిత విద్యుత్ అందించి ఆదుకోవాలన్నారు. విశ్వకర్మలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిపెల్లి వేణుగోపాల చారి, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల వేణుగోపాల చారి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి సత్యనారాయణ, నాయకులు ఉప్పుల శ్రీనివాస్, కుమారస్వామి, రవీందర్, భాస్కరాచారి, దామోదరాచారి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

గజ్వేల్‌రూరల్: పబ్లిక్ హెల్త్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ గజ్వేల్ డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గజ్వేల్ పట్టణంలో మంగళవారం పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్(3194) జిల్లా అధ్యక్షుడు కాల్వ చక్రధర్ ఆధ్వర్యంలో గజ్వేల్ డివిజన్ నూతన అధ్యక్షుడిగా నారాయణ, ప్రధాన కార్యదర్శిగా వాసుదేవ్, ట్రెజరర్‌గా మంగ, జాయింట్ సెక్రటరీగా నాగరాజు, సభ్యులుగా సుజాత, నిరూప, షకీల్, మల్లేశం, బాలకిషన్, అడ్వైయిజర్ కమిటీ సభ్యుడిగా తిరుపతి రెడ్డి, సురేష్‌కుమార్, ప్రభాకర్, నరేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ప్రేమ, నీరజ, సరస్వతిని ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడారు. పారామెడికల్ సిబ్బంది డిమాండ్లపై చర్చించడం జరిగిందన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, బకాయి ఉన్న మూడు డీఏలను వెంటనే ఇవ్వాలని, పీఆర్సీ అమలు చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. పీహెచ్‌సీలలో అధికారుల వేధింపులు ఆపడంతోపాటు పని ఒత్తిడి తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, అర్హత కలిగిన వారికి పదోన్నతులు కల్పించడంతో పాటు అన్ని క్యాడర్ల వారికి ప్రతీనెల 1వ తేదీన వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఎలక్షన్ అధికారులుగా జేఏసీ కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా మహిళావింగ్ అధ్యక్షురాలిగా శోభ వ్యవహరించారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ దుర్గమ్మ గుడి నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న జెడ్పీటీసీ భూక్య మంగ శ్రీనివాస్

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల కేంద్రంలోని మర్రిచెట్టు వద్ద దుర్గమ్మ గుడి నిర్మిస్తున్నారు. నిర్మాణానికి మంగళవారం జెడ్పీటీసీ భూక్య మంగ శ్రీనివాస్ రూ.25,116 విరాళం సర్పంచ్ ముత్యాల సంజీవ్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎల్లయ్య, నాయకులు చింతల మల్లారెడ్డి, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

◆ విద్యార్థినికి అభినందనలు



గజ్వేల్‌రూరల్: జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు గజ్వేల్ మున్సిపాలిటీ పరిధి ఆర్‌అండ్‌ఆర్ కాలనీ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని బి.అక్షిత ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎస్‌జీఎఫ్(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో ఈనెల 13 నుంచి 15 వరకు మహబూబ్‌నగర్ జిల్లా నారాయణరావుపేటలో అండర్-14 విభాగంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. విద్యార్థిని అక్షితను హెచ్‌ఎం కరీమొద్దీన్ అభినందించారు. కాగా జాతీయ స్థాయి పోటీలు ఈనెల 22 నుంచి 25 వరకు ఒడిశాలో జరగనున్నట్లు తెలిపారు.

◆ రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

మద్దూరు(హుస్నాబాద్): రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని లద్నూరు గ్రామంలో చోటు చేసుకుంది. మంగళవారం గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బొడ్డు ప్రేమలత (76) కుమారుడు అమెరికాలో ఉంటున్నాడు. కుమారుడు దగ్గరకు వెళ్లేందుకు వీసా కోసం ఆదివారం హైదరాబాద్ వెళ్లింది. హైదరాబాద్‌లో ఉంటున్న కూతురు వద్దకు వెళ్లి వీసా తీసుకొని సోమవారం గ్రామానికి తిరిగి వస్తోంది. ఈ క్రమంలో జనగామ నుంచి లద్నూరుకు వస్తున్న గ్రామస్తుడి బైక్‌పై ఎక్కింది. గ్రామ శివారులో బైక్ అదుపు తప్పడంతో ఆమె కిందపడి తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు లద్నూరు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం జనగామ ఆసుపత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందింది. మృతురాలికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.



ప్రేమలత (ఫైల్)

◆ మరో సైబర్ మోసం

సిద్దిపేటకమాన్: క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామంటూ వచ్చిన ఫోన్‌కాల్‌కు ఓ వ్యక్తి స్పందించి సైబర్ మోసానికి గురైన సంఘటన మంగళవారం జరిగింది. మంగళవారం పోలీసు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామంటూ వచ్చిన లింకును క్లిక్ చేశాడు. బ్యాంకు, క్రెడిట్ కార్డు వివరాలు నమోదు చేశాడు. వెంటనే అతడి ఖాతా నుంచి రూ.1,19,989 డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. అలాగే టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి అపరిచితుడు ఫోన్‌చేసి ఆన్‌లైన్‌లో తక్కువ మొత్తంలో పెట్టుబడి పెడితే ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయని నమ్మబలికాడు. అతడి మాటలు నమ్మిన బాధితుడు మొదట రూ.2 వేలు పెట్టుబడి పెట్టాడు. వెంటనే అతడికి రూ.5వేలు పంపాడు. వెంటనే మరో రూ.3 వేలు పంపగా రూ.6 వేలు వచ్చాయి. తర్వాత రూ.30 వేలు పంపించాడు. తర్వాత ఆ నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో సైబర్ మోసం జరిగినట్లు గ్రహించాడు. బాధితులు జాతీయ హెల్ప్ లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేశారు.

◆ యువకుడి రిమాండ్

కొండపాక(గజ్వేల్): పెళ్లి పేరిట యువతిని మోసం చేసిన కేసులో యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తొగుట సీఐ కమలాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొండపాక మండలం దమ్మక్కపల్లి గ్రామానికి చెందిన వల్లెపు హరీష్ అదే గ్రామానికి చెందిన యువతి మూడేళ్లుగా ప్రేమించుకున్నారు. వారు మానసికంగా, శారీరకంగా ఒక్కటయ్యారు. పెళ్లి చేసుకోవాలని యువతి పట్టుబట్టడంతో కొద్ది రోజుల తరువాత చేసుకుంటానంటూ నమ్మబలికాడు. ఇప్పుడు తనకు సంబంధం లేనట్లుగా వ్యవహరించడంతో ఈనెల 13వ తేదీన కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌లో హరీష్‌పై బాధిత యువతి ఫిర్యాదు చేసింది. తొగుట సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో యువతిని హరీష్ మోసం చేసినట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. మంగళవారం అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

◆ రేపు సృజన టెక్ ఫెస్ట్

కొమురవెల్లి(సిద్దిపేట): చేర్యాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 21వ తేదీన సృజన టెక్‌ఫెస్ట్ 2023ను నిర్వహించ నున్నట్లు ప్రిన్సిపాల్ జి.మోహన్‌బాబు మంగళవారం తెలిపారు. ఎలక్ట్రికల్, ఇంజనీరింగ్ నమూనాలకు జిల్లాస్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. ఉత్తమ నమూనాలను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు.

◆ వాటర్ ప్లాంట్ ప్రారంభం

తొగుట(దుబ్బాక): మండల పరిధి ఎల్లారెడ్డిపేటలో బాలవికాస, సోలార్ ప్యాక్ ఇండియా ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛమైన నీటిని తాగితే ఆరోగ్యంగా ఉంటామన్నారు. ప్లాంట్‌లో కేవలం రూ.5 లకే 20 లీటర్ల నీటిని అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ స్వామి, ఉప సర్పంచ్ ప్రవీణ్‌రెడ్డి, బాలవికాస ప్రతినిధి రామచంద్రారెడ్డి, సోలార్ ప్యాక్ ఇండియా ప్రతినిధి ప్రతాపరెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు శ్రీనివాస్‌రావు, ప్రసాద్ పాల్గొన్నారు.